క్లుప్తంగా

ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలి



సి.బెళగల్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ పీరయ్యతో మాట్లాడుతున్న సీఐ శ్రీధర్

సి.బెళగల్: గ్రామాలలో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై పోలీసులు సత్వరమే స్పందించి, పరిష్కారానికి కృషి చేయాలని కోడుమూరు సీఐ శ్రీధర్ సూచించారు. బుధవారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ రికార్డులు, కేసుల వివరాలు ఎస్‌ఐ పీరయ్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందితో ఈ మధ్యకాలంలో నమోదైన కేసులు, ప్రజల ఫిర్యాదులపై సమీక్ష నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉండి ఆపదలో ఉన్నవారికి సహాయపడాలని, ప్రజలు ఇచ్చే ఫిర్యాదులపై పోలీసులు సత్వరమే స్పందించాలన్నారు. విధుల నిర్వహణలో జాగ్రతలను వహించాలని, భూ తగాదాలను సివిల్ కోర్టులు, రెవెన్యూ పరిధిలో పరిష్కరించుకునేలా ప్రజలకు సూచించాలన్నారు. అదేవిధంగా పెట్టి కేసులను లోక్ అదాలత్‌లోకి వచ్చేలా ఫిర్యాదు దారులకు అవగాహన కల్పించాలని సూచించారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు 11 మంది విద్యార్థుల ఎంపిక

కోడుమూరు రూరల్ : కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది జాతీయ స్థాయిలో 8వ తరగతి చదివే విద్యార్థులకై నిర్వహించే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ అర్హత పరీక్షలో మండలానికి చెందిన 11 మంది విద్యార్థులు అర్హత సాధించినట్లు ఎంఈఓ అనంతయ్య బుధవారం తెలిపారు. అత్యధికంగా కోడుమూరు మోడల్ స్కూల్‌కు చెందిన ఏడుగురు విద్యార్థులు ఎంపికవ్వడం గర్వకారణమన్నారు. అలాగే బాలికల హైస్కూల్ ఇద్దరు, బాలుర హైస్కూల్, ప్యాలకుర్తి హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ఒక్కొక్కరు చొప్పున ఎంపికైనట్లు వెల్లడించారు. నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్‌కు ఎంపికై న విద్యార్థులకు ప్రభుత్వం ఏడాదికి రూ.12వేల ప్రకారం నాలుగేళ్లు చెల్లిస్తుందన్నారు. పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులను, వారికి శిక్షణిచ్చిన ఉపాధ్యాయులను ఈ సందర్భంగా ఎంఈఓ అనంతయ్య అభినందించారు.

ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడిగా సుబ్బానాయక్



ఎమ్మెల్యే కాటసానికి కృతజ్ఞతలు తెలుపుతున్న సుబ్బానాయక్

ఓర్వకల్లు : వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా గుడుంబాయి తండాకు చెందిన బణావత్ సుబ్బానాయక్ ఎంపికైనట్లు ఆ సంఘం జిల్లా నాయకులు తెలిపారు. బుధవారం ఆయన ఎమ్మెల్యే కాటసాని స్వగృహానికి చేరుకొని తన నియామకానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో కాల్వ గ్రామ సర్పంచు వెంకటేశ్వర్లు, మద్దిలేటి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఫ్యాన్లు, దోమ తెరలు



విద్యార్థులకు ఫ్యాన్లు, దోమ తెరలను అందిస్తున్న దృశ్యం

గూడూరు రూరల్: గూడూరు పట్టణంలోని ఎస్సీ బాలికల వసతి గృహంలోని విద్యార్థినులకు బుధవారం జూలకల్ ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఫ్యాన్లు, దోమ తెరలను ప్రిన్సిపాల్ దిల్షాద్ చేతుల మీదుగా అందించారు. ఆమె మాట్లాడుతూ ఆదర్శ పాఠశాలలోని 6,7వ తరగతుల విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గూడూరులోని బాలికల హాస్టల్‌లోని విద్యార్థినులకు అవసరమైన ఫ్యాన్లు, దోమ తెరలను సొంత ఖర్చులతో కొనుగోలు చేసి ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో అందించారని చెప్పారు. రానున్న రోజుల్లో విద్యార్థుల ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలను చేపడతామన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

సి.బెళగల్: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఉపాధ్యాయులు బుధవారం వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈనెల 14న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని మండల అధికారుల కమిటీ ఆధ్వర్యంలో జెడ్పీ హైస్కూళ్లలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు అంబేడ్కర్ జీవిత విశేషాలపై వ్యాసన రచన పోటీలను నిర్వహించారు. పాఠశాలల వారిగా మొదటి మూడు స్థానాలలో నిలిచిన విద్యార్థులకు గురువారం బహుమతులను అందజేయనున్నట్లు మండల అధికారుల కమిటీ కన్వీనర్, ఎంపీడీఓ రాముడు తెలిపారు. అదేవిధంగా గురువారం మండల కేంద్రం సి.బెళగల్‌లోని స్త్రీ శక్తి భవన్‌లో విద్యార్థులకు మండల స్థాయి వక్తృత్వపు పోటీలను నిర్వహించి ప్రతిభ కనరపచిన విద్యార్థులకు బహుమతులును అందిస్తామని నిర్వహణ కమిటీ కో కన్వీనర్, ఈఓఆర్డీ సందీప్ తెలిపారు.

ఆశాజనకంగా మొక్కజొన్న

- రబీలో అధిక విస్తీర్ణంలో సాగు
- ఆశించిన స్థాయిలో దిగుబడులు
- మార్కెట్‌లో గిట్టుబాటు ధర
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతన్నలు



పంటను తూకం వేస్తున్న దృశ్యం



చిన్నటేకూరు వద్ద మొక్కజొన్న దిగుబడులు ఆరబెట్టిన రైతులు

కల్లూరు : రబీలో సాగు చేసిన మొక్కజొన్న పంటల దిగుబడులు ఆశించిన మేరకు రావడంతో పాటు మార్కెట్‌లో గిట్టుబాటు ధరలు లభిస్తున్నాయి. దీంతో పెట్టిన పెటుబడులు చేతికి అందుతున్నాయని మండలంలో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గతేడాది కంటే అధిక విస్తీర్ణంలో సాగు

మండల వ్యాప్తంగా రబీ సీజన్‌లో ఈ ఏడాది 6,367 ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేశారు. అందుల్లో అత్యధికంగా 2,767 ఎకరాల్లో మొక్కజొన్న పంట వేశారు. గతేడాది రబీలో 1,350 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేయగా ఈ ఏడాది సాగు విస్తీర్ణం రెట్టింపు అయ్యింది. మార్కెట్‌లో దిగుబడులకు మంచి ధర ఉండటంతో రైతులకు లాభాలు రావడంతో ఈ సారి మొక్కజొన్న విస్తీర్ణం రెట్టింపు అయ్యింది.

తక్కువ పెట్టుబడి అధిక ఆదాయం

మిగతా పంటలతో పోల్చితే మొక్కజొన్న సాగుకు పెట్టుబడి ఖర్చు తక్కువ. రైతులకు శ్రమ కూడా తక్కువే. దినికి తోడు మార్కెట్‌లో మొక్కజొన్న క్వింటా ధర రూ. 2,000 పలుకుతోంది. ఎకరా సాగుకు విత్తనం నుంచి పంట కోత వరకు రూ. 25వేల వరకు ఖర్చు అవుతుంది. దిగుబడి ఎకరారకు 30 నుంచి 40 క్వింటాళ్ల వరకు వస్తుంది.

ధరలు కొంత వరకు మేలు



రబీ సీజన్‌లో 2.50 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశాను. రెండున్నర ఎకరాలకు కలపి మొత్తం రూ.70వేలు పెట్టుబడి పెట్టాను. గత రెండు సంవత్సరాల నుంచి మందుల ధరలు పెరగడంతో పెట్టుబడి ఖర్చు మరో పదివేలు పెరిగింది. రెండున్నర ఎకరాల్లో 103 క్వింటాళ దిగుబడి వచ్చింది. పెట్టుబడి ఖర్చు రూ.70వేలు పోను నాకు రూ.1,32,910 లాభం వచ్చింది. - మాధవయ్య, రైతు, చిన్నటేకూరు.

ఆశించిన దిగుబడి వచ్చింది

నేను రబీ సీజన్‌లో 65 సెంట్లలో డ్రిప్ పద్ధతిలో మొక్కజొన్న సాగు చేశాను. పంటకు జీవామృతం ఎరువును ఉపయోగించి, 8 కిలోల 20-20-20, ఒక సంచి 13-0-45 వేశాను. దాంతోపాటు వ్యవసాయ అధికారులు సూచనలు పాటించాను. మొత్తం 65 సెంట్లకు పెట్టుబడి రూ.14,250 ఖర్చు చేశాను. దిగుబడి ఆశాజనంగా వచ్చింది. మొత్తం 31 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఆశించిన స్థాయిలో ధర ఉండడంతో పెట్టుబడి ఖర్చుపోను రూ.46వేలు లాభం వచ్చింది.

- శ్రీనివాస గౌడ్, రైతు, చిన్నటేకూరు

చనుగొండ్లలో 'నువ్వే మా నమ్మకం జగనన్న'

గూడూరు రూరల్ : మండల పరిధిలోని చనుగొండ్లలో మండల కో ఆప్షన్ సభ్యుడు దౌల ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నువ్వే మా నమ్మకం జగనన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని బీసీ కాలనీలో ఇంటింటికీ సచివాలయ కన్వీనర్, గృహసారథులు, వైఎస్సార్‌సీపీ నాయకులు తిరుగుతూ గత నాలుగేళ్ల పాలనలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, నగదు బదిలీ పథకాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించి తలుపులు, గోడలకు స్టిక్కర్లను అతికించారు. లబ్ధిదారులు కూడా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి స్టిక్కర్లను ఇంటకి అతికించుకున్నారు.

లద్దగిరిలో జగనన్నే మా భవిష్యత్..

కోడుమూరు రూరల్ : మండలంలోని లద్దగిరి గ్రామంలో బుధవారం సాయంత్రం జగనన్నే మా భవిష్యత్- మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని ఎంపీపీ గాడి రూతమ్మ ఆధ్వర్యంలో ఎంపీటీసీ ఈశ్వరయ్య, సచివాలయ కన్వీనర్ బందె నవాజ్, స్థానిక నేతలు ఎంతో అట్టహాసంగా నిర్వహించారు. పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్న జగనన్న ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు గిడ్డమూర్తి, గోవిందు, మద్దయ్య, లక్ష్మన్న, కల్లపరి లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు



షరీన్‌నగర్‌లో లబ్ధిదారుడికి పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- 29వ వార్డులో 'జగనన్నే మా భవిష్యత్తు'

కల్లూరు : రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం కల్లూరు అర్బన్ 29వ వార్డు షరీన్‌నగర్‌లో కన్వీనర్లు, గృహసారథుల ఆధ్వర్యంలో జరుగుతున్న జగనన్నే మా భవిష్యత్తు- మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ఇంటింటికీ వెళ్లి పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. వారి అనుమతితో ఇళ్లకు స్టిక్కర్లు అతికించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నాలుగు సంవత్సరాల కాలంలో ప్రజలకు చేసిన మంచిని వివరించడమే కార్యక్రమం ఉద్దేశమన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేద తల్లిదండ్రులు పిల్లల చదువులకు ఇబ్బందులు పడకుడదనే అమ్మ ఒడి, జగనన్న వసతి దీవేన, విద్యా దీవేన, జగనన్న విద్యా కానుక, గోరు ముద్ద పథకాలను అందిస్తున్నామన్నారు. రాబోయే ఎన్నికల్లో మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకుందామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు శివ, తిరుమలేష్‌గౌడ్, శివారెడ్డి, నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వంలోనే సుపరిపాలన

ఓర్వకల్లు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తర్వాతే రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని లొద్దిపల్లె గ్రామంలో 'జగనన్ననే మా భవిష్యత్' కార్యక్రమంలో భాగంగా గడప గడపకు తిరిగి ప్రజల కష్టాలను తెలుసుకొని 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లను ఇళ్లకు అతికించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు సరిగా లేకపోయినప్పటికీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను సజావుగా అమలు చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. రాష్ట్రంలో గత ఏ ప్రభుత్వాలు చేయలేని విధంగా అన్ని సంక్షేమ పథకాలు మహిళల పేరుమీదనే మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అంతకు ముందు ఉయ్యాలవాడలో జగనన్న హౌసింగ్ లే అవుట్‌ను పరిశీలించి త్వరలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, సచివాలయ మండల కన్వీనర్ లోటర్ బాషా, గ్రామ సర్పంచు పుష్పమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు నాగశిరీష, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వనితల కోసం 'మహిళా సమ్మాన్'



మహిళకు పాసుపుస్తకాన్ని అందజేస్తున్న నంద్యాల పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు

గడివేముల: స్త్రీల ఆర్థిక ప్రయోజనం కోసం తపాలాశాఖ మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ అనే కొత్త పథకం అందుబాటులో తీసుకొచ్చినట్లు నంద్యాల తపాలాశాఖ సూపరింటెండెంట్ శ్రీనివాస రావు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని పోస్టాఫీసులో మహిళలకు పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శ్రీనివాసరావు మట్లాడుతూ మహిళల నుంచి చిన్న మొత్తాలను పొదుపుకు అనువుగా ఈపథకం ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. ఈ పథకంలో భాగంగా రూ.వెయ్యి నుంచి రూ.2 లక్షల వరకు డిపాజిట్ చేసుకునేందుకు అనుమతి ఉంటుందని చెప్పారు. సేవింగ్స్ డబ్బులపై 7.5 శాతం వడ్డీ అందిస్తాన్నారు. ఒక్క రూపాయి నష్టపోకుండా పేమెంట్ ఆఫ్ మెచ్యూరీటీ ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం మహిళ సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ కింద పుస్తకాలను అందజేశారు.కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, ఎస్‌పీఎం విజయభాస్కర్, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాకు మహిళా ఐఏఎస్‌లు రావడం హర్షణీయం



కలెక్టర్‌ను మర్యాదపుర్వకంగా కలిసిన ఎన్జీఓ నేతలు

కర్నూలు(అగ్రికల్చర్):జిల్లా కలెక్టర్ జి.సృజన, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్యలను ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా నేతలు మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగల్ రెడ్డి నేతృత్వంలో కలెక్టర్, జేసీలను వారి చాంబర్లలో కలసి పుష్పగుచ్చాలు బహూకరించారు. మహిళా ఐఏఎస్ అధికారులు జిల్లాకు కలెక్టర్, జేసీగా రావడం హర్షణీయమని వెంగల్‌రెడ్డి పేర్కొన్నారు. కలెక్టర్ సృజన మాట్లాడుతూ జిల్లా పరిపాలనలో ప్రతి ఒక్కరూ కీలకమేనని పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధికి, ప్రభుత్వ పథకాల అమలుకు పూర్తిగా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జవహర్ లాల్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరిరెడ్డి, నగరశాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఎంసీ కాశన్న, పాండురంగా రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి విద్యాకానుక అందాలి



సిబ్బందికి సూచనలిస్తున్న రాష్ట్ర పరిశీలనాధికారి

గడివేముల: ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థికి జగనన్న విద్యాకానుక అందించాలని రాష్ట్ర పరిశీలనాధికారి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీహైస్కూల్, ఎంఈఓ కార్యాలయంలో ఉన్న విద్యాకానుకల స్టాకును పరిశీలించారు. వచ్చే విద్యాసంవత్సరంలో చేరే విద్యార్థులకు జగనన్న విద్యాకానుకలు అవసరమైన వివరాలను అన్‌లైన్ నమోదు చేయాలన్నారు. మిగిలిన విద్యాకానుకల వివరాలను అడిగితెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారి లలిత, ఉపాధ్యాయుడు యూనిస్‌బాషా, ఎంఐఎస్ కోఆర్డినేటర్ హిదాయతుల్లా, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

- పార్టీలకతీతంగా గడప గడపకు సంక్షేమ పథకాలు
- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



కోడుమూరు లక్ష్మీనగర్ కాలనీవాసుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే డా.సుధాకర్

కోడుమూరు: రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. బుధవారం కోడుమూరులోని లక్ష్మీ నగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరు, ప్రజలెదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సీసీ రోడ్లు, మురుగునీటి కాల్వలు వేసేందుకు అవసరమైన ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేయాలని, కరెంటు స్తంభాల ఏర్పాటుకు వెంటనే చర్యలు తీసుకోవాలని పీఆర్, ఎలక్ట్రికల్ ఏఈలను ఎమ్మెల్యే ఆదేశించారు. అలాగే ఇతర కారణాల వల్ల అర్హత కలిగివుండి ప్రభుత్వ పథకాలు అందని వారి జాబితాను తన కిస్తే, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని చెప్పారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అమలు

పార్టీలకతీతంగా దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా లబ్దిదారుడికే పథకాల లబ్ధిని అందజేస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనని ఎమ్మెల్యే సుధాకర్ అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికై తమ ప్రభుత్వం కృషి చేస్తోందని, కోడుమూరులో నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి, డిగ్రీ కళాశాల ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే స్థానిక కొండపేట ప్రాథమిక పాఠశాలలో పట్టణంలోని పొదుపు సంఘాల మహిళలతో సమావేశమై సంక్షేమ పథకాల అమలు తీరు, సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు వైస్‌చైర్మన్ భీమిరెడ్డి, ఎర్రదొడ్డి సర్పంచు మధుసూదన్ రెడ్డి, తహసీల్దార్ శేషఫణి, ఎంపీడీఓ చంద్రశేఖర్, మార్కెట్‌యార్డు డైరెక్టర్ ఇమ్మానేయులు, నాయకులు రాజశేఖరరెడ్డి, ప్రభాకర్, మధు మోహన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, బలరాం తదితరులుపాల్గొన్నారు.

ఇరు వర్గాల ఘర్షణ.. కేసు నమోదు

గడివేముల: మండల పరిధిలోని గని గ్రామానికి చెందిన ఇరువర్గాలు ఇంటి స్థలం విషయంలో ఘర్షణ పడగా.. కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ బీటీ వెంకటసుబ్బయ్య బుధవారం తెలిపారు. గ్రామానికి చెందిన చిన్నవెంగన్న, వెంకటేశ్వరమ్మ, మల్లికార్జున, రాఘవేంద్రలపై అదేవిధంగా మరోవర్గానికి చెందిన ఎల్లయ్య, వరలక్ష్మిలపై కేసు నమోదు చేశామన్నారు.

వైఎస్సార్ ఎస్‌యూ మండల అధ్యక్షుడిగా నబీరసూల్

సి.బెళగల్: వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగం వైఎస్సార్ స్టూడెంట్ యూనియన్ మండల అధ్యక్షుడిగా మండలంలోని కంబదహాల్ గ్రామానికి చెందిన నబీరసూల్‌ను ఆ యూనియన్ జిల్లా నాయకులు ఎంపిక చేశారు. బుధవారం కర్నూలు జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వైఎస్సార్‌ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ రెడ్డిపోగు నియామక పత్రాన్ని అందించారు.

నేడు వాహనాల వేలం

గూడూరు: గూడూరు పోలీస్ స్టేషన్ పరిధిలో తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి మద్యం రవాణా చేస్తూ పట్టు పడ్డ 9 బైక్‌లు, ఒక ఆటోను గురువారం బహిరంగ వేలం వేస్తున్నట్లు ఎస్‌ఐ నరేంద్ర బుధవారం తెలిపారు. సెబ్ అధికారుల సమక్షంలో పోలీస్‌స్టేషన్ ఆవరణలో నిర్వహించే వేలంలో ప్రజలు పాల్గొని తమకు కావలసిన వాహనాలను కొనుగోలు చేసుకోవచ్చన్నారు.

నేడు జాబ్ మేళా

కర్నూలు: పీపుల్స్ హెల్త్ సొసైటీ, అమరరాజా స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో గురువారం (నేడు)కర్నూలులోని బిర్లాగేట్ దగ్గర ఉన్న కృష్ణకాంత్ ప్లాజాలోని బ్రహ్మరెడ్డి హాస్పిటల్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఉదయం 10 గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పీపుల్స్ హెల్త్ సొసైటీ జిల్లా కన్వీనర్ సుజాత బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 10వ తరగతి పాస్/ఫెయిల్, ఇంటర్ పాస్/ఫెయిల్, ఐటీఐ పాస్/ఫెయిల్ (ఏ ట్రేడ్ అయినా) 18 నుంచి 25 సంవత్సరాలు వయస్సు లోపువారు జాబ్ మేళాకు అర్హులన్నారు. వివరాల కోసం 91004 77371, 91777 70090 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

భూమి కొనుగోలులో అక్రమాలను నిగ్గు తేల్చండి

కర్నూలు(అర్బన్): జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అమలవుతున్న భూమి కొనుగోలు పథకంలో చోటు చేసుకున్న అవినీతి, అక్రమాలను నిగ్గు తేల్చాలని మాల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాసారపు వెంకటేష్ కోరారు. ఈ ఏడాది ఫిబ్రవరి 3న 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన 'పథకం పారి... చేతులు తడిసి' అనే కథనంపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని ఆయన పత్రికా ప్రతితో పాటు వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజనను బుధవారం కలసి అందజేశారు. ఆదోని మండలం చిన్నగోనేహాల్ గ్రామంలో 29.53 ఎకరాలు, చిన్న హరివనం గ్రామంలో 47.99 ఎకరాలను ఆయా గ్రామాల్లో ఎంపికై న ఎస్సీ లబ్ధిదారులకు భూమి కొనుగోలు పథకం ద్వారా అందజేయాల్సి ఉందన్నారు. అయితే ఎస్సీ కార్పొరేషన్ అధికారులు, రైతులు కుమ్మక్కై అధిక ధరలకు వ్యవసాయానికి పనికిరాని భూమిని కొనుగోలు చేశారన్నారు. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుని వ్యవసాయానికి యోగ్యమైన భూములను పేద ఎస్సీలకు అందించాలని కోరారు.

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రానీయొద్దు

- కర్నూలు ఎంపీపీ ధర్మవరం వెంకటేశ్వరమ్మ
- మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం



మాట్లాడుతున్న కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ

కర్నూలు (న్యూటౌన్): వేసవిలో కర్నూలు మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని కర్నూలు మండల అధ్యక్షురాలు ధర్మవరం వెంకటేశ్వరమ్మ సూచించారు. బుధవారం జెడ్పీలోని కర్నూలు మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణపై మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వేసవిలో ప్రజలు తాగునీటి కోసం అవస్థలు పడకుండా ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఏ గ్రామంలోనైనా తాగునీటి సమస్య ఏర్పడే అవకాశం ఉంటే ముందుగానే తనకు తెలియజేస్తే ఎమ్మెల్యే సుధాకర్ దృష్టికి తీసుకెళ్లి.. ఆయన నిధులతో సమస్యను సత్వరం పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. గ్రామాల్లో అత్యవసరమైతే ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేయించి ప్రజల దాహార్తిని తీరుస్తామని చెప్పారు. సమావేశంలో కర్నూలు ఎంపీడీఓ ఎన్ భాస్కర్ నాయుడు, ఈఓఆర్డీ నాగేశ్వర్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ గ్లాసుల కంపెనీలో కార్మికుల ఘర్షణ

కల్లూరు: మండలంలోని దూపాడు గ్రామ సమీపంలో ఉన్న శ్రీ సూర్య ప్లాస్టిక్స్ కంపెనీలో పని చేసే విషయంలో సూపర్‌వైజర్, కార్మికుల మధ్య వివాదం తలెత్తి పంచాయితీ పోలీస్‌స్టేషన్‌కు చేరింది. అయితే కేసు నమోదు చేయకుండా ఇరువర్గాలను రాజీ కుదర్చడం పలు విమర్శలకు దారి తీసింది. ఫ్యాక్టరీలో సరకు ఉత్పత్తి విషయంలో సూపర్‌వైజర్ రంజన్ కార్మికులను నిలదీయడంతో సమస్య తీవ్రమై ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ ఫ్యాక్టరీలో ఒడిశా రాష్ట్రానికి చెందిన కార్మికులు అర్జున్, సబిత దంపతులతో పాటు అరవింద్, సాయితో పాటు మరికొందరు దినసరి కూలీలుగా పనిచేస్తున్నారు. ఈనెల 9వ తేదీన సరకు ఉత్పత్తి విషయంలో గొడవ జరిగింది. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సూపర్‌వైజర్ రంజన్‌తో పాటు అరవింద్, సాయి కలసి సబిత, అర్జున్ దంపతులపై దాడి చేయడమే కాక అసభ్యంగా ప్రవర్తించినట్లు సమాచారం. అయితే వారు స్థానికులు కాకపోవడంతో పని మానుకుని వెళ్లిపోతామంటూ పోలీసుల వద్ద చెప్పడంతో ఇరువురినీ పోలీసులు రాజీ కుదిర్చినట్లు సమాచారం. ఫ్యాక్టరీలో పనిచేసినందుకు సబిత దంపతులకు కూలి డబ్బులతో పాటు ప్రయాణ ఖర్చులు కలిపి మొత్తం రూ.25 వేలు చెల్లించడంతో రాజీ అయినట్లు ఒప్పంద పత్రం రాసిచ్చినట్లు ఉలిందకొండ ఎస్‌ఐ నల్లప్ప తెలిపారు.

మాతామరణాలు జరగకుండా చూడాలి

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో మాతామరణాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రామగిడ్డయ్య ఆదేశించారు. బుధవారం ఆయన తన ఛాంబర్‌లో మాతృమరణాలపై జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కౌతాళం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గొడూరు గ్రామంలో గత మార్చిలో సంభవించిన మాతృమరణంపై ఆయన సమీక్ష చేశారు. కార్డియాక్ పల్మనరీ అరెస్ట్ కారణంతో మరణం జరిగిందని కమిటీ నిర్ధారించింది. క్షేత్రస్థాయిలోని సిబ్బంది ఆశా, ఆరోగ్య కార్యకర్త, వైద్యాధికారులు గర్భవతులను తొందరంగా గుర్తించి వారికి సరైన సమయంలో వైద్యసేవలు అందించినట్లయితే తల్లుల మరణాల శాతం తగ్గించవచ్చని కమిటీ నిర్ధారించింది. సమావేశంలో గైనకాలజీ హెచ్‌వోడీ డాక్టర్ ఎస్.వెంకటరమణ, డీఐవో డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్, డాక్టర్ శ్యామ్‌సుందర్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- ఘనంగా చెన్నకేశవస్వామి ఆలయ నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారోత్సవం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ఓర్వకల్లు : స్థానిక చెన్నకేశవస్వామి ఆలయ అభివృద్ధికి దేవదాయ శాఖ అధికారులు, పాలక మండలి సభ్యులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సూచించారు. బుధవారం మండల కేంద్రమైన ఓర్వకల్లు చెన్నకేశవ స్వామి ఆలయంలో నూతన ధర్మకర్త మండలి సభ్యుల ప్రమాణ స్వీకారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈఓ మద్దిలేటి ఆధ్వర్యంలో జరిగిన ప్రమాణ స్వీకారోత్సవానికి స్థానిక ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడు, సర్పంచు తోట అనూష ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పురాతన ఆలయాలను అభివృద్ధిలోకి తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యాత కల్పిస్తోందన్నారు. అందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అనంతరం నూతన ధర్మకర్త మండలి చైర్మన్‌గా ఎస్. వాసుదేవ రెడ్డి, సభ్యులుగా దేవేంద్రారెడ్డి, పి. సులోచన, రామాంజనమ్మ, చేట్ల. సులోచన, వెంకటలక్ష్మి, తిరుమలేష్ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, ఎంపీడీఓ శివనాగప్రసాద్, సింగిల్ విండో చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, జెడ్పీ హై స్కూల్ ఎస్‌ఎంసీ చైర్మన్ మద్దిలేటి, వైఎస్సార్‌సీపీ నాయకులు శంకర్‌రెడ్డి, మీనిగ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.